గోల్కొండ టైమ్స్

GOLCONDA TIMES NEWS

Regd. by Govt of India
No.UDYAM-TS-20-0003208

www.golcondatimes.com | శనివారం 28, మార్చి 2026 | పేజీలు : 03

బాల రాముడి నుదుటిపై సూర్య తిలకం

పులకించిపోయిన భక్తులు
వర్చువల్‌గా వీక్షించిన ప్రధాని మోదీ 02

సెంట్రల్ పవర్ ఇంజినీరింగ్ సర్వీస్, ఇండియన్ ఎకనామిక్ సర్వీస్ అధికారులు శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిశారు. సమ్మిళిత, సుస్థిర అభివృద్ధిని ప్రోత్సహించే విధానాలను రూపొందించడంలో, సంస్కరణలను అమలు చేయడంలో ఈ అధికారులు కీలక పాత్ర పోషిస్తారని రాష్ట్రపతి అన్నారు. జిజ్ఞాస, నూతన ఆవిష్కరణల పట్ల నిబద్ధత, నిరంతరం నేర్చుకోవాలనే తపనతో తమ బాధ్యతలను నిర్వర్తించాలని ఆమె వారికి సూచించారు. - న్యూఢిల్లీ

నయనానందకరం..
జానకిరాముల పరిణయం

వైభవంగా మిథిలా నగర సంబరం

అంగరంగ వైభవంగా తిరుకల్యాణ మహోత్సవం
పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్ దంపతులు
హాజరైన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తదితరులు
రూ.351 కోట్లతో తొలిదశ అభివృద్ధి పనులకు భూమిపూజ

గోల్కొండ టైమ్స్, భద్రాచలం :

భద్రాచలం సీతారామచంద్ర స్వామి వారి తిరుకల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటుంబ సమేతంగా ఈ వేడుకలో పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామి వారికి పట్టుపస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. స్వామి వారిని దర్శించుకుని ఆశీర్వచనం తీసుకున్నారు. శుక్రవారం మిథిలా స్టేడియంలో జరిగిన ఈ తిరుకల్యాణ మహోత్సవంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి అనసూయ సీతక్క, వాకిటి శ్రీహరి, ఇతర ప్రజా ప్రతినిధులు, డీజీపీ శివధర్‌రెడ్డి, ఉన్నతాధికారులు, అశేషంగా భక్తులు పాల్గొన్నారు. సీతారామచంద్ర స్వామి వారి..

మిగతా 2లో...

గుజరాత్ తీరానికి
జగ్ వసంత్

42 వేల టన్నుల గ్యాస్‌తో రాక

గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో :

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ భారత్‌కు మరో ఎల్‌పీజీ ట్యాంకర్ సురక్షితంగా చేరుకుంది. 'జగ్ వసంత్' అనే పేరు గల ఈ నౌక, 42 వేల టన్నుల ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ (ఎల్పీజీ)తో శుక్రవారం గుజరాత్‌లోని కాండ్లా ఓడరేవుకు వచ్చింది. హర్మూజ్ జలసంధి మూసివేత భయాల నడుమ ఈ నౌక తన ప్రయాణ మార్గంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడం గమనార్హం. సోమవారం 'పైన్ గ్యాస్' అనే మరో ట్యాంకర్‌తో కలిసి ప్రయాణం ప్రారంభించిన 'జగ్ వసంత్'.. సంప్రదాయ మార్గానికి బదులుగా ఖైష్మ్-లారక్ ఛానెల్ ద్వారా హర్మూజ్ జలసంధిని దాటింది. ఈ మార్గంలో ప్రయాణిస్తున్నప్పుడు తమను స్పష్టంగా భారతీయ నౌకలుగా గుర్తించేందుకు వీలుగా వాటిపై సందేశాలను

మిగతా 2లో...

బ్లాక్ మార్కెటింగ్‌పై ఉక్కుపాదం మోపాలి

టీమ్ ఇండియాగా కలిసి పనిచేయాలని పిలుపు

ధరలు పెరగకుండా అప్రమత్తంగా ఉండాలి | సీఎంలతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ | ముఖ్యమంత్రులతో వర్చువల్ వీడియో కాన్ఫరెన్స్

గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో :

యుద్ధ వాతావరణాన్ని సాకుగా చూపి వస్తువులను అక్రమంగా నిల్వ చేసే వారిపై, బ్లాక్ మార్కెటింగ్ చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రులను ఆదేశించారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో నిర్వహించిన వర్చువల్ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఇందులో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తదితరులు పాల్గొన్నారు. ఇంధన సరఫరా (పెట్రోల్, డీజిల్, గ్యాస్), ఎరువుల లభ్యత, నిత్యావసర వస్తువుల ధరలు పెరగకుండా రాష్ట్రాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కోవిడ్-19 సమయంలో ప్రదర్శించినట్లే, ఇప్పుడు కూడా కేంద్రం, రాష్ట్రాలు 'టీమ్ ఇండియా'గా కలిసి పనిచేసి ఈ అంతర్జాతీయ సంక్షోభాన్ని ఎదుర్కోవాలని ప్రధాని పిలుపునిచ్చారు. ఇంధన కొరత లేదా లాక్‌డౌన్ వంటి తప్పుడు పుకార్లను ప్రజలు నమ్మకుండా చూడాలని, సరైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాలని కోరారు. తీరప్రాంత భద్రత, సరిహద్దు రక్షణ, సైబర్ భద్రతపై నిఘా పెంచాలని, వ్యూహాత్మక సంస్థల రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని...

మిగతా 2లో...

సజావుగా పెట్రో ఉత్పత్తుల సరఫరా

రాష్ట్ర, జిల్లాల్లోనూ కమిటీల ఏర్పాటు.. నోడల్ ఆఫీసర్ల నియామకం
పీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో

పెట్రోలో, డీజిల్, గ్యాస్ సరఫరాకు సంబంధించి సమీక్షకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఒక కమిటీని నియమించి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల పరిస్థితుల నేపథ్యంలో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం సాయంత్రం నిర్వహించిన వర్చువల్ వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పలు అంశాలను ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

గ్రీన్ ఎనర్జీ, ఇన్‌ఫ్రాలో పెట్టుబడులు పెట్టండి

హార్వర్డ్ కెన్నడీ స్కూల్ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి | 02

హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సీఎస్ ఆధ్వర్యంలోని కమిటీ పరిస్థితులను ఎప్పటికప్పుడు..

మిగతా 2లో...

పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం భారీగా తగ్గింపు

అంతర్జాతీయ మార్కెట్‌లో ఆకాశాన్ని తాకుతోన్న ముడిచమురు ధరలు
కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం

గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో :

కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై విధిస్తున్న ఎక్సైజ్ సుంకాన్ని భారీగా తగ్గించింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు ఆకాశాన్ని తాకుతున్న నేపథ్యంలో పెట్రోల్‌పై లీటరుకు ఎక్సైజ్ సుంకాన్ని రూ.13 నుంచి రూ.3కు, డీజిల్‌పై లీటరుకు ఉన్న రూ.10 ఎక్సైజ్ సుంకాన్ని పూర్తిగా తొలగించింది. ఈ క్రమంలో వినియోగదారుల్లో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గుతాయని అన్న

మిగతా 2లో...

ఏప్రిల్ 25న కొత్త పొలిటికల్ పార్టీ

రాజకీయ పార్టీగా తెలంగాణ జాగృతి సంస్థ
మునీరాబాద్ వేదికగా పార్టీ జెండా, అజెండాను ప్రకటన
మేము ఎవరికీ బీ టీమ్ కాదు. తెలంగాణలో మాదే నంబర్ వన్ పార్టీ
ప్రాక్టికల్‌గా, ప్రజల ఆమోదం పొందేలా అజెండా
ఢిల్లీలో లాబీయింగ్ చేయగలను. గల్లీలో కష్టపడగలను
తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో :

తెలంగాణ జాగృతి సంస్థ ను రాజకీయ పార్టీగా మార్చబోతున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. ఏప్రిల్ 25న మేడ్చల్ లోని మునీరాబాద్ వేదికగా పార్టీ ఆవిర్భవ సభ ఉంటుందన్నారు. అదే రోజు పార్టీ జెండా, అజెండా ప్రకటిస్తామని చెప్పారు. శ్రీరామ నవమి సందర్భంగా తన మెట్టినిల్లు నిజామాబాద్ నుంచి కవిత ఈ ప్రకటన చేశారు. తెలంగాణ భవిష్యత్ ను మార్చే దారి దీపంలా జాగృతి పార్టీ ఉంటుందన్నారు. సర్వోదయ తెలంగాణ కోసం తాము పనిచేస్తాని స్పష్టం చేశారు. తెలంగాణ జాగృతి యే మన రాష్ట్ర ప్రాంతీయ పార్టీగా, ప్రతి ఒక్కరి ఇంటి పార్టీగా ఉంటుందన్నారు. కొత్త పార్టీ ఏర్పాటు చేయగానే ఎవరికీ బీ టీమ్ అంటూ విమర్శలు చేసే సంస్కృతి ఉండటం బాధాకరమని చెప్పారు. తమ పార్టీ ఎవరికీ బీ టీమ్ కాదని...తమదే తెలంగాణలో నంబర్ వన్ పార్టీ అవుతుందని చెప్పారు. కుల, మత, వర్గాలకు అతీతంగా సర్వ జనుల కోసం పనిచేస్తామని చెప్పారు. సర్వ జనుల్లో వెలుగులు నింపేలా సర్వోదయ తెలంగాణ కోసం తమ పార్టీ పనిచేస్తుందన్నారు. తమ అజెండా ప్రాక్టికల్ గా, ప్రజల ఆమోదం పొందే విధంగా ఉంటుందన్నారు. ఇప్పటికే 50 కమిటీలు వేయటంతో పాటు మేధావులతోనూ చర్చలు జరుపుతున్నామని చెప్పారు. తెలంగాణ ప్రజలు కూడా కొత్తగా ఏర్పాటు చేయబోయే తమ పార్టీ ఏ విధంగా పనిచేయాలో సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. తమ ఫోకస్ అంతా కూడా తెలంగాణ మీదనే ఉంటుందని కవిత స్పష్టం చేశారు. రాజకీయ పార్టీకి ఈగో ఉండకూడదన్నారు. గతంలో తనను విమర్శించిన

మిగతా 2లో...

హైదరాబాద్ కేంద్రంగా
రూ.217 కోట్ల జీఎస్‌టీ స్కాం

నగరంలో డిజిజిఐ అధికారుల తనిఖీల్లో వెల్లడి
విచారణలో 72 షెల్ కంపెనీల నెట్‌వర్క్ బట్టబయలు
ఫేక్ డాక్యుమెంట్లతో రూ.1,472 కోట్ల విలువైన కృత్రిమ లావాదేవీలు

గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో :

తెలుగు రాష్ట్రాల్లో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ (డిజిజిఐ) అధికారులు భారీ జీఎస్‌టి కుంభకోణాన్ని బయటపెట్టారు. హైదరాబాద్ కేంద్రంగా సాగుతున్న ఈ దందాపై పక్కా సమాచారంతో శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఏకంగా రూ.217 కోట్ల మేర పన్ను ఎగవేసినట్లుగా జరిగినట్లు గుర్తించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న సుమారు 72 షెల్ కంపెనీల

నెట్‌వర్క్ విచారణలో బట్టబయలైంది. ఎలాంటి ఎటువంటి వస్తువుల సరఫరా, సర్వీసు లేకుండా..

మిగతా 2లో...

ప్రముఖ చరిత్రకారుడు డా.జైశెట్టి రమణయ్య
కన్నుమూత

సంతాపం ప్రకటించిన కేసీఆర్

02

జూన్ 2నుంచి
పాదయాత్ర

తీన్మార్ మల్లన్న ప్రకటన
బీసీ రాజ్యాధికారం దిశగా వ్యూహం
సన్నాహాలు మొదలు

02

నేపాల్ ప్రధానిగా
బాలేన్ షా ప్రమాణ స్వీకారం

అత్యంత పిన్న వయస్కుడైన ప్రధానిగా రికార్డు
మాజీ ప్రధాని కేపీ శర్మ ఓలీపై భారీ మెజారిటీతో ఘన విజయం
2022లో కత్మాండు మేయర్‌గా గెలిచి రాజకీయాల్లోకి..

కత్మాండు : నేపాల్ నూతన ప్రధానిగా రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ (ఆర్ఎస్పీ) పార్లమెంటరీ నేత బాలేన్ షా బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం అధ్యక్ష భవన్‌లో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడు రామ్‌చంద్ర పౌడెల్, రాజ్యాంగంలోని ఆర్టికల్ 76(1) ప్రకారం బాలేంద్ర షాను ప్రధానిగా నియమించారు. 35 ఏళ్ల వయసులో బాధ్యతలు స్వీకరించి, దేశ 47వ ప్రధానిగా అరుదైన రికార్డు నమోదు చేశారు. అత్యంత పిన్నవయస్కుడైన ప్రధానమంత్రిగా రికార్డులకెక్కారు. హిందూ, బౌద్ధ సంప్రదాయాల సమ్మేళనంగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రారంభానికి సంకేతంగా ఏడుగురు కళాకారులు శంఖనాదం చేశారు. 108 మంది పండితులు స్వస్తి శాంతి మంత్రాలు పఠించారు. 16 మంది బౌద్ధ భిక్షువులు అష్టమంగళ మంత్రాలను చదివారు. వేడుక సంప్రదాయాల సమన్వయానికి ప్రతీకగా నిలిచింది. మార్చి 5న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బాలేంద్ర షా నేతృత్వంలోని ఆర్ఎస్పీ పార్టీ మంచి ఫలితాలను సాధించింది. 275 స్థానాల్లో 182 సీట్లు గెలుచుకుని మూడింట రెండొంతుల మెజారిటీకి చేరువైంది.

ఓలీపై భారీ మెజారిటీతో గెలుపు..

ఎన్నికల ప్రచారంలోనే బాలేన్ షాను ప్రధాని అభ్యర్థిగా ఆ పార్టీ ప్రకటించింది. గురువారం జరిగిన సమావేశంలో అతడిని పార్లమెంటరీ పార్టీ నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకుంది. దీంతో ఆయన ప్రధాని కావడం ఖరారైంది. ఝాపా-5 నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఆయన..

మిగతా 2లో...

గ్రీన్ ఎనర్జీ, ఇన్‌ఫ్రా రంగాల్లో పెట్టుబడులు పెట్టండి

ప్రపంచానికి కేంద్రంగా భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నాం
"చైనా+1" కు ప్రత్యామ్నాయంగా ఎదగడమే లక్ష్యం
హార్వర్డ్ కెన్నడీ స్కూల్ సదస్సులోముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో :

మానవజాతి గొప్ప ఆవిష్కరణల్లో ఒకటైన కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ – ఏఐ) రెండు వైపులా పదునైన కత్తిలాంటిదని, అప్రమత్తంగా సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రతికూల ప్రభావాలు ఎక్కువగా ఉంటాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. అమెరికా బోస్టన్ సిటీలోని హార్వర్డ్ విశ్వవిద్యాలయంలోని హార్వర్డ్ కెన్నడీ స్కూల్, కృత్రిమ మేధస్సు (ఏఐ) పై సదస్సులో ముఖ్యమంత్రి వర్చువల్‌గా పాల్గొని ప్రసంగించారు. తెలంగాణకు ప్రాతినిధ్యం వహిస్తూ, ఈ ఏఐ సింపోజియంలో మాట్లాడే భారతీయుడిగా తనకు ఎంతో గర్వకారణంగా భావిస్తున్నానని చెప్పారు. ఏఐ, గ్రీన్ ఎనర్జీ, ఇన్‌ఫ్రా రంగాల్లో పెట్టుబడులకు హైదరాబాద్‌లో అవకాశం ఉందని.. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. "ఇప్పుడు ప్రపంచమంతా విస్తరిస్తుంది. గతంలో నూతన సాంకేతికత వచ్చినప్పుడు భయాలు కలిగాయి. ఇప్పటివరకు ఏ టెక్నాలజీకి తనకు తానుగా సొంత నిర్ణయ సామర్థ్యం లేదు. ఏఐకు స్వతంత్ర నిర్ణయ సామర్థ్యం ఉండటమే భయాలకు కారణం. పారిశ్రామ విప్లవం రాకతో యంత్రాల ముందు మనిషి శారీరక సామర్థ్యం తగ్గిపోయిందని, ఇప్పుడు ఏఐతో, మనిషి ఆలోచనా సామర్థ్యానికి కూడా సవాలు ఎదురవుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ఏఐ కూడా డాక్టర్లు, న్యాయవాదులు, ఆర్కిటెక్టులు, రచయితలు వంటి వారి పనిలో మార్పు తీసుకువస్తుందే తప్ప పూర్తిగా వారిని పూర్తిగా తొలగించడం సాధ్యం కాదన్నారు. కాకపోతే, ఏఐతో తక్కువ మంది ఉద్యోగులతో ఎక్కువ ఉత్పత్తి సాధ్యమవుతుందన్నారు. అదే సమయంలో కంపెనీల ఉత్పాదకత పెరుగుతుంది.

వైట్ కాలర్ జాబ్‌ల సక్సెస్‌పైనే హైదరాబాద్ ఆధారపడి ఉందని, ఏఐ ఉద్యోగాలను తగ్గిస్తే, అందరూ సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి సవాళ్లను అధిగమించాలన్న ఆలోచనతో "భారత్ ఫ్యూచర్ సిటీ" అనే కొత్త నగరాన్ని నిర్మిస్తున్నామని చెప్పారు. అందులో ఒక భాగాన్ని ఏఐ సిటీగా అభివృద్ధి చేస్తున్నామని ఆయన వివరించారు. మనుషుల నైపుణ్యాలను ఉపయోగించి ఏఐ అభివృద్ధికి ప్రపంచానికి కేంద్రంగా భారత్ ఫ్యూచర్ సిటీని తీర్చి దిద్దుతామని చెప్పారు. ఏఐ మార్చలేని గ్లోబల్ టూరిజం, గ్రీన్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ వాహనాలు, మౌలిక సదుపాయాలు వంటి రంగాల్లో ఉద్యోగాలను యుద్ధ ప్రాతిపదికన పెంచుతున్నామని ఆయన తెలియజేశారు. గ్రీన్ ఎనర్జీ ఆధారంగా తయారీ రంగాన్ని అభివృద్ధి చేసి "చైనా+1" కు ప్రత్యామ్నాయంగా ఎదగాలనేది మా లక్ష్యమన్నారు. ఉద్యోగాలు కోల్పోయే వారికి పునఃశిక్షణ అందించేందుకు హార్వర్డ్ వంటి ప్రపంచ విశ్వవిద్యాలయాలతో భాగస్వామ్యం చేసుకుంటున్నామన్నారు. కాలుష్యానికి కార్బన్ క్రెడిట్స్ ఉన్నట్లే, ఏఐకంపెనీలకు "పీపుల్ క్రెడిట్స్" విధానాన్ని అమలు చేయాలని యోచిస్తున్నామన్నారు.

నయనానందకరం..జానకిరాముల కల్యాణం

మొదటి పేజీ తరువాయి..

ఆలయ విస్తరణ కోసం తొలిదశ రూ.351 కోట్లతో అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి భూమిపూజ నిర్వహించారు. ఇందులో రూ.180 కోట్లతో ఆలయ విస్తరణ, మౌలిక సదుపాయాల కల్పన, రూ.96 కోట్లతో ఆలయ పరిసరాల అభివృద్ధి, రూ.75 కోట్లతో గోదావరి ఘాట్ అభివృద్ధి వంటి పనులు చేపట్టనున్నారు. భద్రాచలం సీతారాముల కల్యాణాన్ని కళ్లారా చూసేందుకు అత్యధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా సాగింది.

శ్రీరామ నామస్మరణతో భద్రాచలం పుర వీధులన్నీ మార్మోగిపోయాయి. ఈ సీతారాముల కల్యాణాన్ని తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు పోటెత్తారు.

భారీ ఏర్పాట్లు..!

రాములోరి కళ్యాణాన్ని చూసేందుకు వచ్చిన భారీ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భద్రాచలం ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తుల కోసం ముత్యాల తలంబ్రాలు.. లడ్డు ప్రసాదాలను పంపిణీ చేయడం కోసం స్పెషల్ కౌంటర్లు ఏర్పాటు చేసి ఎలాంటి ఇబ్బంది లేకుండా చేశారు. భక్తులు భారీగా తరలివచ్చిన నేపథ్యంలో వారికి ఇబ్బందులు లేకుండా పోలీస్ శాఖ భారీ ఎత్తున బందోబస్తును ఏర్పాటు చేసింది. భద్రాద్రి జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో.. పోలీస్ సిబ్బంది భద్రత ఏర్పాట్లు చేశారు. మరోవైపు.. భద్రాచలం శ్రీరామనవమి కల్యాణోత్సవంలో ప్రభుత్వం తరఫున సమర్పించే పట్టు వస్త్రాలను సుమారు 100 ఏళ్లుగా ఒకే కుటుంబం అందిస్తోంది. సికింద్రాబాద్‌కు చెందిన ఎస్ఎస్ జయరాజు ఫ్యామిలీ.. ఈ పట్టు వస్త్రాలను సిద్ధం చేస్తోంది. ఆ కుటుంబంలోని 3 తరాలు.. ఈ సంప్రదాయాన్ని పాటిస్తున్నాయి. భద్రాచలం ఆలయం ఆవరణలోనే ప్రత్యేకంగా ఒక మగ్గాన్ని ఏర్పాటు చేసి.. పోచంపల్లి స్టైల్‌లో సీతమ్మకు చీరలు.. రామలక్ష్మణులకు పంచెలను నేశారు. రూ.2 లక్షల వ్యయంతో తయారు చేసిన ఈ పట్టు వస్త్రాలను నేడు సీఎం రేవంత్ రెడ్డి దంపతులు స్వామివారికి సమర్పించారు.

బ్లాక్ మార్కెటింగ్‌పై ఉక్కుపాదం మోపాలి

మొదటి పేజీ తరువాయి..

ప్రధాని నొక్కి చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికలు జరగనున్న ఐదు రాష్ట్రాలైన అస్సాం, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరి మినహా అన్ని రాష్ట్రాల సీఎంలు పాల్గొన్నారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తోపాటు ఏపీ సీఎం చంద్రబాబు, ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణు దేవ్‌సాయి, తెలంగాణ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, జమ్మూ కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా, పంజాబ్ సీఎం భగవంత్ మాన్, మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్, జార్ఖండ్ సీఎం హేమంత్ సింగ్ సోరెన్ పటేల్, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, తదితరులు హాజరయ్యారు.

పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం భారీగా తగ్గింపు

మొదటి పేజీ తరువాయి..

సందేహాలు మొదలయ్యాయి. అయితే, ఎక్సైజ్ సుంకం తగ్గించినప్పటికీ, పెట్రోల్ బంకుల్లో ధరలు వెంటనే భారీగా తగ్గే అవకాశం తక్కువేనని నిపుణులు భావిస్తున్నారు.

నష్టాల్లో ఆయిల్ కంపెనీలు..

గత కొన్ని వారాలుగా అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరిగినా.. దేశీయంగా ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ఆ భారాన్ని వినియోగదారులపై వేయకుండా అవే భరించాయి. ప్రస్తుతం లీటర్ పెట్రోల్‌పై రూ.24, డీజిల్‌పై రూ.30 వరకు ఈ కంపెనీలు నష్టపోతున్నట్లుగా సమాచారం. ప్రభుత్వం తగ్గించిన ఈ ఎక్సైజ్ సుంకాన్ని ఆయిల్ కంపెనీలు తమ పాత నష్టాలను పూడ్చుకోవడానికి, ధరలు మరింత పెరగకుండా అడ్డుకోవడానికి ఉపయోగించుకునే అవకాశం ఉంది. దీంతో రీటెయిల్ అవుట్‌లెట్లలో వినియోగదారులు కొనుగోలు చేసే పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గే అవకాశం అంతమాత్రమేనని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

గుజరాత్ తీరానికి జగ్ వసంత్

మొదటి పేజీ తరువాయి..

రాసుకొచ్చారు. ఇరాన్ అధికారుల నుంచి ముందస్తు అనుమతితోనే ఈ నౌకలు ఇలా ప్రయాణించి ఉండొచ్చని నిపుణులు భావిస్తున్నారు. ఇటీవలి కాలంలో భారత్‌కు సురక్షితంగా చేరుకున్న మూడో ఎల్‌పీజీ ట్యాంకర్ ఇది. ఇప్పటికే 'శివాలిక్', 'నందా దేవి' అనే మరో రెండు నౌకలు గుజరాత్‌లోని ముంద్రా, వాడినార్ ఓడరేవులకు చేరుకున్నాయి. ఆ రెండు నౌకలు కలిపి 92,000 టన్నులకు పైగా ఎల్‌పీజీని తీసుకొచ్చాయి. 'జగ్ వసంత్' హర్ముజ్ జలసంధిని సురక్షితంగా దాటిందని నౌకాయాన మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ కుమార్ సిన్హా ముందే వెల్లడించారు. ప్రస్తుతం కాండ్లా పోర్టుకు చేరిన ఈ నౌక నుంచి ఎల్‌పీజీ బదిలీ ప్రక్రియ త్వరలోనే ప్రారంభం కానుంది.

సజావుగా పెట్రో ఉత్పత్తుల సరఫరా

మొదటి పేజీ తరువాయి..

సమీక్షిస్తోందని ప్రధానమంత్రి మోదీ దృష్టికి తీసుకెళ్లారు. 33 జిల్లాల్లోనూ గ్యాస్ సరఫరా, పెట్రోల్, డీజిల్ విక్రయాలు.. బ్లాక్ మార్కెట్ నిరోధానికి కమిటీలు ఏర్పాటు చేసి నోడల్ అధికారులను నియమించినట్లు సీఎం తెలిపారు. ప్రాధాన్య క్రమంలో ఆసుపత్రులు, పాఠశాలలు, అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలకు కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను పంపుతున్నట్లు సీఎం వెల్లడించారు. ప్రతి బంక్‌లో స్టాక్ ఎంత ఉంది.. ఎంత విని యోగిస్తున్నారనే దానిపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారని సీఎం తెలిపారు. తెలంగాణలో సాధారణ రోజుల్లో రోజుకు 36,189 కిలో లీటర్ల పెట్రోల్, డీజిల్ వినియోగం జరుగుతుందని, ప్రస్తుతం 1,88,210 కిలోలీటర్ల నిల్వలు ఉన్నట్లు సీఎం వివరించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరతపై సోషల్ మీడియాలో అపోహలు, భయాందోళనలు కలిగేలా పోస్టులు పెడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు సీఎం తెలిపారు.

ఎల్రక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నాం...

తెలంగాణలో శిలాజ ఇంధనాలపై (బొగ్గు, చమురు, గ్యాస్) ఆధారపడడం తగ్గించి ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామని.. పునరుత్పాక విద్యుత్ ఉత్పత్తి పెంచుతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా తెలంగాణలో ఈవీలపై వంద శాతం రోడ్డు పన్ను, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయించామన్నారు. ఈవీల తయారీ, బ్యాటరీ ఎకోసిస్టమ్ ను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి పీఎం మోదీ దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్ నగరంలో 1.20 లక్షకుపైగా ఉన్న పెట్రోల్, డీజిల్ ఆటోలను రిట్రోఫిట్టింగ్ ద్వారా ఈవీలుగా మార్చే ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీలో ఇక ముందు అన్ని ఈవీ బస్సులనే వినియోగించనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి పాల్గొన్నారు.

హైదరాబాద్ కేంద్రంగా రూ.217 కోట్ల జీఎస్‌టీ స్కాం

మొదటి పేజీ తరువాయి..

కేవలం ఫేక్ డాక్యుమెంట్లతో రూ.1,472 కోట్ల విలువైన కృత్రిమ లావాదేవీలను సృష్టించినట్లుగా తెలుస్తోంది.

ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ దోపిడీ..

నకిలీ లావాదేవీలతో ప్రభుత్వానికి చెల్లించాల్సిన జీఎస్టీని ఎగ్గొట్టడమే కాకుండా, తప్పుడు పద్ధతిలో రూ.217 కోట్ల మేర ఐటీసీని క్లెయిమ్ చేసినట్లుగా దర్యాప్తులో తేలింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయాలతో పాటు ఏపీలోని పలు ప్రాంతాల్లో డీజీజీఐ అధికారులు ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో కీలకమైన డిజిటల్ సాక్ష్యాధారాలు, నకిలీ ఇన్వాయిస్ కాపీలను స్వాధీనం చేసుకున్నారు.

జూన్ 2నుంచి పాదయాత్ర

- తీన్మార్ మల్లన్న ప్రకటన
- బీసీ రాజ్యాధికారం దిశగా వ్యూహం
- సన్నాహాలు మొదలు

గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో :

తెలంగాణ రాజకీయాల్లో తనదైన శైలిలో దూసుకుపోతున్న తీన్మార్ మల్లన్న, రాష్ట్ర రాజకీయాల్లో మరో సంచలనానికి తెరలేపారు. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా భారీ పాదయాత్ర చేపట్టనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ యాత్ర వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం బీసీలకు, వెనుకబడిన తరగతులు రాజ్యాధికారం కల్పించడమేనని అన్నారు. ఇప్పటికే దీనికి సంబంధించి మల్లన్న పార్టీ 'తెలంగాణ రాజ్యాధికార పార్టీ' (టీఆర్పీ) వర్గాలు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నాయి. బీసీల సామాజిక న్యాయం, రాజకీయ హక్కులు, వారిని అధికారంలో భాగస్వాములను చేయడమే లక్ష్యంగా ఈ సుదీర్ఘ ప్రయాణం సాగనుంది. ఈ పాదయాత్ర కేవలం ఒక ప్రదర్శన మాత్రమే కాకుండా, క్షేత్రస్థాయిలో వెనుకబడిన వర్గాల బలోపేతానికి ఒక వేదికగా నిలవనుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. గ్రామగ్రామాన పర్యటించి, బీసీల సమస్యలను వినడమే కాకుండా, వారి రాజకీయ సాధికారతకు అవసరమైన మద్దతును కూడగట్టనున్నారు. ఇప్పటికే రూట్ మ్యాప్ సిద్ధమైనందున, ఏ జిల్లా నుండి యాత్ర ప్రారంభమవుతుంది, ఏయే దశల్లో సాగుతుంది అనే వివరాలు త్వరలోనే అధికారికంగా వెల్లడి కానున్నాయి.

ఏప్రిల్ 25న కొత్త పొలిటికల్ పార్టీ

మొదటి పేజీ తరువాయి..

వారైనా సరే తెలంగాణ కోసం పనిచేసే ఉద్దేశం ఉంటే కలిసి రావాలని పిలుపునిచ్చారు. తాను ఏదైనా పని పట్టుకుంటే ఫలితం వచ్చే వరకు కూడా వదిలి పెట్టనని... తెలంగాణ కోసం ఏర్పాటు చేసే రాజకీయ పార్టీ ద్వారా కూడా తెలంగాణ భవిష్యత్ ను మార్చే వరకు పోరాడుతానని చెప్పారు. అవసరమైతే ఢిల్లీలో లాబీయింగ్ చేయగలనని...గల్లీలో కూడా కష్టపడతానని కవిత చెప్పారు. శ్రీరామనవమి సందర్భంగా ఆ శ్రీరాముడి స్ఫూర్తితో పార్టీ ప్రకటన చేస్తున్నానని అన్నారు. పాలన పై ప్రజాభిప్రాయం తీసుకొని వైఫల్యాలను మార్చుకున్న వ్యక్తి శ్రీరామ చంద్రుడని కవిత గుర్తు చేశారు. శ్రీరామ నవమి రోజు చేసిన పార్టీ ప్రకటన నుంచి పార్టీ ఆవిర్భావం నాటికి ఇంకా 28 రోజులు ఉన్నాయని అన్నారు. ఈ 28 రోజుల్లో అభ్యుదయ, సామాజిక తెలంగాణ కోసం మేధావులతో చర్చలు చేస్తామన్నారు. పార్టీ ఆవిర్భావ సభ నాటికి కాశీకి వెళ్లి శివుడికి అభిషేకం చేస్తామని చెప్పారు. ఆ తర్వాత పార్టీ ఆవిర్భావ సభ ఉంటుందన్నారు. తాను ముహూర్తాలను నమ్ముతానని...అందుకే శ్రీరామనవమి రోజు పార్టీ ప్రకటన చేశానన్నారు. కాలానుగుణంగా పనులు చేస్తే ప్రజలకు మంచి జరుగుతుందని నమ్ముతున్నానని కవిత చెప్పారు.

సబ్బండ వర్గాలు సభకు విచ్చేయండి...

ఏప్రిల్ 25 న జరిగే పార్టీ ఆవిర్భావ సభకు సబ్బండ వర్గాలు రావాలంటూ కవిత ఆహ్వానించారు. తెలంగాణ వచ్చిన 12 ఏళ్ల తర్వాత కూడా నీళ్లు, నిధులు, నియామకాలను సంపూర్ణంగా సాధించుకోలేకపోవటం బాధాకరమన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన ఆ తర్వాత రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో కూడా ఇంకా మనం మౌలిక సదుపాయాల కోసం కూడా పోరాటం చేసే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ కూడా బస్సు ప్రమాదాలు, కుక్క కాట్లు, మక్క కొనుగోలు సెంటర్లు వంటి వాటి కోసం కూడా ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాల్సిన పరిస్థితి ఏంటనీ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి అయ్యే వరకు ఒక విధంగా ముఖ్యమంత్రి అయిన తర్వాత ఒక విధంగా ప్రవర్తించటం కొత్త రాజకీయ ఒరవడిగా మారిందన్నారు. ఈ పరిస్థితిని మార్చాలంటే ప్రజల్లో చైతన్యం రావాల్సిన అవసరముందన్నారు. ఇచ్చిన మాట అమలు చేయకపోయినా సరే ప్రజలు పట్టించుకోవరన్న ధైర్యం రాజకీయ నాయకుల్లో ఉందన్నారు. ఆ విధానం పోవాలంటే ప్రజలు ప్రశ్నించాల్సిన అవసరముందని చెప్పారు. ప్రతిపక్షంలో ఉంటే క్రిటిసిజం, అధికారంలోకి వస్తే ఎస్కేపిజం అన్నట్లుగా రాజకీయ నాయకుల వైఖరి ఉందని విమర్శించారు. ఇలాంటి రాజకీయాల నుంచి తెలంగాణ భవిష్యత్ ను మార్చాల్సిన అవసర ముందని ఆమె చెప్పారు. బీసీలు, ఎస్సీ, ఎస్టీలు, రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు, కార్మికులు ఇలా అన్ని వర్గాల కోసం జాగృతి గత 20 సంవత్సరాలుగా పనిచేసిందని కవిత గుర్తు చేశారు. ఇప్పుడు కూడా ప్రజల కోసం పని చేసేందుకు అన్ని వర్గాల ఆశీర్వాదం కావాలని ఆమె కోరారు. ఏప్రిల్ 25 న జరిగే పార్టీ ఆవిర్భావ సభకు ప్రతి ఒక్కరూ విచ్చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

ఏదైనా పని పట్టుకుంటే ఫలితం వచ్చే వరకు తాను వదలనని కవిత చెప్పారు. గత 20 ఏళ్లుగా జాగృతి సంస్థ పనిచేస్తుందని గుర్తు చేశారు. రాష్ట్రం వచ్చాక, రాకముందు...బీఆర్ఎస్ లో ఉన్నప్పుడు, లేనప్పుడు కూడా తాను ప్రజల కోసం పనిచేశానని గుర్తు చేశారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా 350 మంది రైతులకు జాగృతి సంస్థ తరఫున నాలుగేళ్ల పాటు నెలకు రూ. 2500 పెన్షన్ ఇచ్చామని గుర్తు చేశారు. నిజామాబాద్ ఎంపీగా ఉన్న సమయంలో నిజామాబాద్, పెద్దపల్లి రైల్వే లైన్ ను మూడేళ్లలో పూర్తి చేయించానని కవిత చెప్పారు. 25 ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న పనిని తాను చేయిస్తానని చెబితే అంతా నవ్వారని కానీ తాను ఆ పనిని పూర్తి చేశానని చెప్పారు. నిజామాబాద్ ప్రజల ఆశీర్వాదంతో ఎంపీగా పార్లమెంట్ కు వెళ్లానని...వారి దయతోనే ఎన్నో పనులు చేసే అవకాశం, ఎందరో పెద్ద వాళ్లు పరిచయమయ్యారన్నారు. ప్రజల కోసం అవసరమైతే ఢిల్లీలో లాబీయింగ్ చేస్తానని...గల్లీలో కష్టపడతానని చెప్పారు. నిజామాబాద్ వేదిక గా పుట్టిన ఏ ఆలోచన అయిన సరే సక్సెస్ అయ్యిందని...తమ పార్టీ ఆలోచన కూడా కచ్చితంగా విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నిజామాబాద్ కోడలిగా తనకు ఇందూరు ప్రజల ఆశీర్వాదం కావాలన్నారు. తెలంగాణ సోయి లేకపోవటంతోనే బీఆర్ఎస్ అధరణ కోల్పోయిందని చెప్పారు. తమ ఫోకస్ అంతా కూడా తెలంగాణ కోసమేనని చెప్పారు. ప్రజల ఆశీర్వాదం ఉంటే కచ్చితంగా తెలంగాణ రాజకీయాలను మార్చేస్తానని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమకారుల అనుభవాన్ని రాష్ట్ర అభివృద్ధి కోసం ఉపయోగించుకుంటామని అన్నారు. అదే విధంగా వారికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరే వరకు పోరాటం చేస్తామని చెప్పారు. మన జీవితాన్ని శాసించే రాజకీయాల్లోకి ప్రతి ఒక్కరూ అడుగు పెట్టాలని కవిత కోరారు. రాజకీయాలు రాకెట్ సైన్స్ కాదని అందరూ రాజకీయాల్లోకి వచ్చి మార్పు తెచ్చేందుకు కృషి చేయాలని కోరారు. తెలంగాణ రాజకీయాల్లో మార్పు తెచ్చే వరకు కూడా పట్టువదలకుండా పోరాటం చేస్తానని ఆమె చెప్పారు.

డా.జైశెట్టి రమణయ్య కన్నుమూత

సంతాపం ప్రకటించిన కేసీఆర్

జగిత్యాల, హైదరాబాద్ :

తెలంగాణ చరిత్రను, సంస్కృతిని లోకానికి చాటిచెప్పిన ప్రముఖ చరిత్రకారుడు, రిటైర్డ్ లెక్చరర్ డాక్టర్ జైశెట్టి రమణయ్య (85) శుక్రవారం ఉదయం జగిత్యాలలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. వయోభారం మరియు అనారోగ్య సమస్యలతో ఆయన శుక్రవారం ఉదయం కన్నుమూశారు. జగిత్యాల జిల్లాలో మొట్టమొదటి పీహెచ్‌డీ పట్టా పొందిన పరిశోధకుడిగా ఆయన గుర్తింపు పొందారు. 1971లో సిద్దిపేటలో జూనియర్, డిగ్రీ కాలేజీలో హిస్టరీ లెక్చరర్‌గా డా. జైశెట్టి రమణయ్య పని చేశారు. చిన్న వయసులోనే ఉపాధ్యాయ వృత్తిని చేపట్టిన అరుదైన వ్యక్తిగా, జగిత్యాలలో మొట్టమొదట డాక్టరేట్ పొందిన పరిశోధన విద్యార్థిగా వారికి పేరున్నది. "సౌత్ ఇండియా టెంపుల్స్" అనే పరిశోధనాత్మక గ్రంథాన్ని సమర్పించి జైశెట్టి రమణయ్య పీహెచ్‌డీ డాక్టర్ పట్టాను పొందారు.

సంతాపం తెలిపిన కేసీఆర్...

తనకు చదువు చెప్పిన గురువు, జగిత్యాలకు చెందిన ప్రముఖ చరిత్రకారుడు, రిటైర్డ్ లెక్చరర్ డా. జైశెట్టి రమణయ్య మరణం పట్ల, మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విచారం వ్యక్తం చేస్తూ శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా తనకు గురువుగా, అత్యంత ఆత్మీయుడైన రమణయ్యతో తనకున్న అనుబంధాన్ని కేసీఆర్ స్మరించుకున్నారు. రమణయ్య సిద్దిపేటలో లెక్చరర్‌గా పనిచేస్తున్న సమయంలో, తను ఇంటర్మీడియట్ విద్యార్థిగా తన దగ్గర విద్యనభ్యసించిన సందర్భాన్ని కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. ఆయన మరణంపై వారి కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రమణయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వీరితో పాటు జాగృతి అధినేత కల్వకుంట్ల కవిత, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి తదితరులు రమణయ్య భౌతికకాయానికి నివాళులర్పించారు.

బాల రాముడి నుదుటిపై సూర్య తిలకం

పులకించిపోయిన భక్తులు
వర్చువల్‌గా వీక్షించిన ప్రధాని మోదీ

అయోధ్య : శ్రీరామ నవమి సందర్భంగా అయోధ్యలోని బాల రాముడి నుదుటిపై సూర్య తిలకం ఆవిష్కృతమైంది. ఈ ఘట్టాన్ని చూసి భక్తులు పులకించిపోయారు. శ్రీరామ నవమి సందర్భంగా సూర్య కిరణాలు నేరుగా ఆయన నుదుటిని తాకాయి. ఈ దృశ్యం భక్తులకు కనువిందు చేసింది. దివ్యానుభూతికి లోనయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ వర్చువల్‌గా ఈ దృశ్యాన్ని తిలకించారు. రాముడి ఆశీస్సులు దేశ ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నారు. శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా దేశవ్యాప్తంగా భక్తులు భజనలు, రామ నామ జపాలు, రామాయణ పారాయణులు చేశారు.

ఎంఆర్ఐ యుద్ధం ఎఫెక్ట్..!

న్యూఢిల్లీ : ఇరాన్–ఇజ్రాయెల్ యుద్ధం ప్రపంచవ్యాప్తంగా హీలియం కొరతను సృష్టించింది. దీనివల్ల భారత్ లోని ఎంఆర్ఐ సేవలపై ఆందోళనలు పెరుగుతున్నాయి. ఎంఆర్ఐ మాగ్నెట్లను చల్లబరచడానికి హీలియం చాలా అవసరం. ప్రపంచ హీలియం ఉత్పత్తిలో మూడింట ఒక వంతు ఖతార్ నుండే వస్తుంది. ఇరాన్ దాడుల్లో ఖతార్‌లోని గ్యాస్ తయారీ స్టేషన్ ధ్వంసం అవడంతో ఉత్పత్తి నిలిచిపోయింది. దీని ప్రభావంతో స్కాన్ ఖర్చులు పెరిగే అవకాశం ఉంది. తక్షణ సంక్షోభం ఏదీ లేనప్పటికీ, పరిస్థితి ఇలాగే కొనసాగితే సేవల్లో అంతరాయం తప్పదంటున్నారు నిపుణులు.

నేపాల్ ప్రధానిగా బాలేన్ షా ప్రమాణ స్వీకారం

మొదటి పేజీ తరువాయి..

మాజీ ప్రధాని కేపీ శర్మ ఓలీపై భారీ మెజారిటీతో ఘన విజయం సాధించారు. బాలేంద్ర షాకు 68,348 ఓట్లు వచ్చాయి. ఓలీకి 18,734 ఓట్లు లభించాయి. 49,614 ఓట్ల తేడాతో గెలిచారు. 1991 తర్వాత నేపాల్ ఎన్నికల చరిత్రలో అరుదైన రికార్డును బాలేంద్ర షా సృష్టించాడు. 1990లో ఖాట్మండులో మధేశీ కుటుంబంలో బాలేంద్ర షా జన్మించారు. భారత్‌లోని విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ వర్సిటీ నుంచి స్ట్రక్చరల్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ పూర్తి చేశారు. 2022లో స్వతంత్ర అభ్యర్థిగా కఠ్మాండు మేయర్‌గా గెలిచి రాజకీయాల్లోకి వచ్చారు. తక్కువ సమయంలో యువతలో విపరీతమైన ఆదరణ పొందారు. తరం మార్పునకు సంకేతం బాలేంద్ర షా ప్రధానిగా బాధ్యతలు చేపట్టడం నేపాల్ రాజకీయాల్లో మార్పుకు సంకేతంగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. యువ నాయకత్వం ముందుకు రావడంలో కీలక పరిణామంగా భావిస్తున్నారు.

ఆర్ఆర్ఆర్ ప్రాజెక్ట్
దక్షిణ భాగానికి డీపీఆర్
మంత్రి కోమటిరెడ్డికి కేంద్రమంత్రి గడ్కరీ లేఖ

గోల్కొండ టైమ్స్, హైదరాబాద్ :

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ప్రాజెక్టుకు సంబంధించి కీలక అడుగు పడింది. ఈ రహదారి దక్షిణ భాగానికి సంబంధించిన డీపీఆర్‌పై కేంద్రం అప్డేట్ ఇచ్చింది. ఆర్ఆర్ఆర్ ప్రాజెక్ట్ దక్షిణ భాగానికి కన్సల్టెన్సీ డీపీఆర్‌ను రూపొందిస్తున్నామని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ.. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి శుక్రవారం లేఖ రాశారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం డీపీఆర్ తయారీకి సంబంధించి చర్యలు చేపట్టామని.. కన్సల్టెన్సీని అపాయింట్ చేసినట్లు గడ్కరీ ఆచలేఖలో పేర్కొన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి 2025 ఆగస్టు 5న ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగానికి అనుమతివ్వాలని కేంద్రానికి లేఖ రాశారు. ఈ లేఖపై స్పందిస్తూ దక్షిణ భాగానికి డీపీఆర్ తయారీలో ఉందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ మంత్రి కోమటిరెడ్డికి లేఖ రాశారు. డీపీఆర్‌పై నివేదిక వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని ఆ లేఖలో తెలిపారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం డీపీఆర్‌పై నితిన్ గడ్కరీ లేఖ రాయడంపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.. గడ్కరీకి ధన్యవాదాలు తెలిపారు. ఉత్తర భాగం ఇప్పటికే మంజూరై.. టెండర్ దశలో ఉందని కోమటిరెడ్డి గుర్తు చేశారు. దక్షిణ భాగం పట్ల కూడా కేంద్రం నుంచి సానుకూల నిర్ణయం రావడం శుభపరిణామం అన్న మంత్రి కోమటిరెడ్డి... ఇది తెలంగాణకు ఆర్ఆర్ఆర్ గేమ్ ఛేంజర్ కాబోతుందన్నారు.

కేంద్రం సహకారంతో ఆర్ఆర్ఆర్‌ను చేపట్టారు.. ఈ ప్రాజెక్టులో ఉత్తరభాగం మొత్తం 161.5 కిలోమీటర్ల (సంగారెడ్డి జిల్లాలోని గిర్మాపూర్ నుంచి యాదాద్రి జిల్లాలోని తంగడ్‌పల్లి వరకు) మేర రెండు ప్యాకేజీల్లో నిర్మించనున్నారు. ఈ మేరకు త్వరలోనే టెండర్లను ఆహ్వానించనున్నారు. దాదాపు రూ.21వేల కోట్ల వ్యయం అవుతుందని అంచనాలు రూపొందించారు. అలాగే ఆర్ఆర్ఆర్ ప్రాజెక్ట్ దక్షిణ భాగం మొత్తం 201 కిలో మీటర్లు (తంగడ్‌పల్లి నుంచి సంగారెడ్డి జిల్లాలోని గిర్మాపూర్ వరకు) కాగా.. తెలంగాణ ప్రభుత్వం ఉత్తరభాగంతో సమాంతరంగా దక్షిణ భాగం ఈ పనులనూ చేపట్టాలనిగతంలో డీపీఆర్‌ను చేపట్టింది. కేంద్రానికి కూడా తెలంగాణ సర్కార్ అనేకసార్లు కోరింది. ఇప్పుడు డీపీఆర్‌పై అప్డేట్ వచ్చింది.

ఖమ్మం-బస్తర్ కారిడార్‌ను నాలుగు లేన్లుగా విస్తరించండి
కేంద్రానికి ఎంపీ వద్దిరాజు విజ్ఞప్తి

న్యూఢిల్లీ : తెలంగాణ, మధ్య భారతానికి వ్యూహాత్మక జీవనాధారమైన ఖమ్మం- బస్తర్ కారిడార్‌ను వెంటనే నాలుగు లేన్లుగా విస్తరించాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర చెప్పారు. తూర్పు తెలంగాణ, దానిని ఆనుకుని ఉన్న ప్రాంతాలలో అనుసంధానం, భద్రత, ఆర్థికాభివృద్ధిపై ప్రత్యక్షంగా ప్రభావం చూపే ఒక కీలకమైన మౌలిక సదుపాయాల లోపం గురించి దృష్టి సారించాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. హై-స్పీడ్ కారిడార్ల ద్వారా హైదరాబాద్ నుండి ఖమ్మం వరకు ఉన్న రహదారి మార్గంలో గణనీయమైన అభివృద్ధి కనిపిస్తోందన్నారు.అయితే, ఖమ్మం వెలుపల కొత్తగూడెం-భద్రాచలం ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతాల అనుసంధానం నిర్లక్ష్యానికి గురైందన్నారు. వ్యూహాత్మకంగా ఇది అత్యంత కీలకమైన ఒక జీవనాడి అని, దీనిని ఒడిషా వైపు కూడా అనుసంధానం చేయొచ్చని ఎంపీ రవిచంద్ర తెలిపారు.రాజ్యసభలో శుక్రవారం ఆయన జీరో అవర్ లో మాట్లాడారు.ఈ కారిడార్ కేవలం ఒక రహదారి మాత్రమే కాదని,ఇది తెలంగాణ-ఛత్తీస్‌గఢ్-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను అనుసంధానించే వ్యూహాత్మకమైనదని చెప్పారు. ఈ నెట్‌వర్క్‌కు కొత్తగూడెం కేంద్ర బిందువుగా ఉంటుందన్నారు.

సింగరేణి బొగ్గు క్షేత్రాలు, థర్మల్ విద్యుత్ ప్లాంట్లు, ప్రధాన పరిశ్రమలకు నిలయమైన కొత్తగూడెం-పాల్వంచలు తెలంగాణ పారిశ్రామిక, ఇంధన వెన్నెముకగా ఉన్నాయని ఎంపీ రవిచంద్ర చెప్పారు. ఇంతటి ప్రాముఖ్యత ఉన్నా కూడా ఖమ్మం దాటాక ఈ ప్రాంతంలో రహదారి మౌలిక సదుపాయాలు సరిగా లేవని ఎంపీ రవిచంద్ర కేంద్ర ప్రభుత్వం దృష్టికి తెచ్చారు.ఈ ప్రాంతం గుండా వెళ్లే వాహనాలు తరుచూ ట్రాఫిక్ రద్దీలో చిక్కుకోవాల్సి వస్తున్నదని వివరించారు.ఖమ్మం-కొత్తగూడెం-భద్రాచలం-బస్తర్ కారిడార్ ను వెంటనే నాలుగు లేన్ల రహదారిగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నాలుగు లేన్ల కారిడార్ కొత్తగూడెంను త్రిరాష్ట్ర లాజిస్టిక్స్ కేంద్రంగా రూపుదాల్చి రాష్ట్రాల మధ్య బొగ్గు,ఖనిజాలు, అటవీ ఉత్పత్తులు, పారిశ్రామిక వస్తువుల నిరాటంక రవాణాను సులభతరం చేస్తుందని ఎంపీ వద్దిరాజు వివరించారు.

ఈ రహదారి అత్యంత గిరిజన, వెనుకబడిన ప్రాంతాల గుండా వెడుతుందని, ఈ అనుసంధానాన్ని బలోపేతం చేయడం ద్వారా ఈ వర్గాలను ప్రధాన ఆర్థిక వ్యవస్థలో ఏకీకృతం చేయొచ్చని,విద్య, ఆరోగ్య సంరక్షణ, మార్కెట్లను మరింత మెరుగుపరుస్తుందని చెప్పారు బస్తర్,సుక్మా వైపు విస్తరించి ఉన్న ప్రాంతాలతో సహా ఇది నక్సల్ ప్రభావిత ప్రాంతమని, మౌలిక సదుపాయాలు కేవలం అభివృద్ధి మాత్రమే కాదు అని,అవి భద్రతా దళాలకు, పరిపాలనకు, స్థిర త్వానికి ఒక వ్యూహాత్మక అవసరం అని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. అదనంగా ఈ కారిడార్ హైదరాబాద్ నుండి బస్తర్ అనుసంధాన్ని మరింత బలోపేతం చేసి, దీనిని ప్రత్యక్ష ఆర్థిక, మానవతా జీవనాడిగా మారుస్తుందని ఆయన వివరించారు. ఇప్పటికే ఖమ్మం వరకు పటిష్టమైన కారిడార్లను నిర్మించామని, అత్యంత కీలకమైన లోపించిన అనుసంధానాన్ని బలోపేతం చేయడం ద్వారా ఈ దార్ఘనికతను పూర్తి చేయాల్సి ఉందని ఎంపీ రవిచంద్ర అభిప్రాయపడ్డారు. ఈ కారిడార్ ఆర్థిక, సామాజిక వ్యూహాత్మక ప్రాముఖ్యతను గుర్తించి, దీనిని నాలుగు లేన్లుగా విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం తగు ప్రాధాన్యతనిచ్చి అనుమతులు మంజూరు చేయాల్సిందిగా ఆయన కోరారు.దీంతో, మూడు రాష్ట్రాల అనుసంధానానికి, అభివృద్ధికి కొత్తగూడెం కేంద్ర బిందువుగా ఆవిర్భవిస్తుందని ఎంపీ వద్దిరాజు వివరించారు.

కేటీఆర్ రామ నామ స్మరణ
రాజన్న సిరిసిల్లలో శ్రీరామ నవమి వేడుకలు
జగదభిరాముడి సేవలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్
ఆలయాల్లో కేటీఆర్ ప్రత్యేక పూజలు

గోల్కొండ టైమ్స్, సిరిసిల్ల :

శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిర్వహించిన వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) పాల్గొన్నారు. జిల్లాలోని పలు పురాతన, ప్రసిద్ధ ఆలయాలను దర్శించుకున్న ఆయన, సీతారాముల కల్యాణ మహోత్సవాలను వీక్షించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, రాముడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, వేదాశీర్వచనం అందించారు. భక్తులతో కలిసి కల్యాణ వేడుకల్లో పాల్గొన్న కేటీఆర్, స్వయంగా తలంబ్రాల కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. రామనామ స్మరణతో మారుమోగుతున్న ఆలయ ప్రాంగణాల్లో భక్తులతో ముచ్చటించి, వారికి నవమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శోభాయాత్రకు పటిష్ట బందోబస్తు
- డ్రోన్, సీసీటీవీ కెమెరాలతో పర్యవేక్షణ
- పట్టణంలోని ప్రధాన కూడళ్లకుండా కొనసాగిన ర్యాలీ
- సిబ్బందికి సూచనలు ఇచ్చిన ఎస్పీ అఖిల్ మహాజన్

గోల్కొండ టైమ్స్, ఆదిలాబాద్ :

శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదిలాబాద్ పట్టణంలో నిర్వహించబడనున్న ర్యాలీకి జిల్లా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. స్థానిక టీఎన్జీవో గార్డెన్ నందు ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన కూడళ్ళు, ముఖ్య మార్గాల వెంట ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ర్యాలీ సజావుగా, శాంతియుతంగా కొనసాగేందుకు సుమారు 300 మంది పోలీసు సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలుగా డ్రోన్ కెమెరాలు, సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ నిర్వహించారు.

పోలీసు శాఖ తరపున ప్రజల భద్రతకు అన్ని విధాల చర్యలు తీసుకున్నామని, ప్రజలు నిబంధనలు పాటిస్తూ శాంతియుతంగా పండుగను జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. డ్రోన్ కెమెరా సిసి కెమెరా ద్వారా జిల్లా ఎస్పీ ర్యాలీ ప్రశాంతంగా కొనసాగేలా ప్రత్యేకంగా పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి బి.సురేందర్‌రావు, శిక్షణ ఐపీఎస్ రాహుల్ కాంత్, డీఎస్పీ పోతారం శ్రీనివాస్, ఎల్ జీవన్ రెడ్డి, కమతం ఇంద్ర వర్ధన్ పాల్గొన్నారు.

శ్రీ రాముని జీవితము అందరికీ ఆదర్శం
ఎస్పీ డాక్టర్ వినీత్

గోల్కొండ టైమ్స్, నారాయణపేట :

శ్రీరాముని జీవితం అందరికీ ఆదర్శమని, సమాజంలో మంచిని స్వీకరించి చెడును వదిలివేయాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ కుమార్ పేర్కొన్నారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని నారాయణపేట జిల్లా కేంద్రంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీరామనవమి ర్యాలీని ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా పళ్ల హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎస్పీ, అనంతరం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. పాత బస్టాండ్, సత్యనారాయణ చౌరస్తా, యాద్గిరి రోడ్, అంబేద్కర్ చౌరస్తా, మహంకాళి వీధి, దూల్‌పేట్, మోచివాడ, సరాఫ్ బజార్, సుభాష్ రోడ్ మార్గాల మీదుగా ర్యాలీ కొనసాగింది. అనంతరం బ్రహ్మనవాడి రామాలయంలో సామూహిక ప్రార్థనలు, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి కన్న శివకుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యా యాదవ్, ఏఎంసీ చైర్మన్ సదాశివరెడ్డి తదితర నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇదే సందర్భంగా జిల్లా కేంద్రంలోని మూల హనుమాన్ మందిరంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు.

సీతారాముల ఆశీస్సులతో
ప్రజలు చల్లగా ఉండాలి
నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

గోల్కొండ టైమ్స్, హత్నూర :

సీతారాముల ఆశీస్సులతో ప్రజలు చల్లగా ఉండాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం నస్తీపూర్ గ్రామ రామాలయంలో శుక్రవారం శ్రీరామనవమి సందర్భంగా రాములోరి కళ్యాణోత్సవానికి హాజరై సీతారామస్వామికి అక్షింతలు వేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీతారామచంద్ర స్వామి ఆశీస్సులతో ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో, చల్లగా ఉండాలని కోరారు. నాస్తిపూర్ రామాలయంలో సీతారాముల కల్యాణం వైభవోపేతంగా నిర్వహించడం పట్ల ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం మాజీ లేబర్ బోర్డు చైర్మన్ దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ సీతారాముల అనుగ్రహంతో గ్రామప్రజలు, అదేవిధంగా నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, సర్పంచ్ ప్రమీల సాయిలు, ఉప సర్పంచ్ మహేందర్, నరసింహారెడ్డి, మధు, వి.శంకర్, బీజేపీ నాయకులు తోట రాజు, తోట స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌కు అంతర్జాతీయ మ్యాచ్‌లు
హెచ్‌సీఏ సెక్రటరీ జీవన్ రెడ్డి కృషి ఫలితం

గోల్కొండ టైమ్స్, హైదరాబాద్ :

కొంతకాలంగా అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లకు దూరంగా ఉన్న ఉప్పల్ స్టేడియం మళ్లీ అంతర్జాతీయ క్రీడా ఉత్సాహంతో కళకళలాడనుంది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కృషితో బీసీసీఐ అనుమతితో టీమిండియా-జింబాబ్వే జట్ల మధ్య రెండు అంతర్జాతీయ మ్యాచ్‌లు రాజీవ్ గాంధీ ఉప్పల్ మైదానం వేదికగా జరగనున్నాయి. అక్టోబర్ 14, 2026న టీ20 మ్యాచ్, జనవరి 6, 2027న వన్డే మ్యాచ్ నిర్వహించనున్నట్లు హెచ్‌సీఏ సెక్రెటరీ ప్రకటించారు. ఈ మ్యాచ్‌లను హైదరాబాద్‌కు తీసుకురావడంలో హెచ్‌సీఏ నూతన సెక్రటరీ మన్నే జీవన్‌రెడ్డి కీలక పాత్ర పోషించారు. గత కొంతకాలంగా ఉప్పల్ మైదానంలో అంతర్జాతీయ మ్యాచ్‌లు లేకపోవడంతో ప్రేక్షకుల్లో నిరాశ నెలకొంది. అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన స్టేడియంలో మ్యాచ్‌లు జరగకపోవడం వల్ల హెచ్‌సీఏ ప్రతిష్ట కూడా దెబ్బతింది. ఈ పరిస్థితిని మార్చాలని సంకల్పించిన జీవన్‌రెడ్డి, బీసీసీఐ అధికారులతో పలుమార్లు చర్చలు జరిపి జింబాబ్వే టూర్‌లో భాగంగా హైదరాబాద్‌కు మ్యాచ్‌లు కేటాయింపునకు ఒప్పించడంలో విజయవంతమయ్యారు.

ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. "హైదరాబాద్‌కు మళ్లీ అంతర్జాతీయ క్రికెట్ తీసుకురావడం మా ప్రధాన లక్ష్యం. ఇది మొదటి అడుగు మాత్రమే. రాబోయే రోజుల్లో మరిన్ని అంతర్జాతీయ మ్యాచ్‌లను ఉప్పల్‌కు తీసుకురావడానికి కృషి చేస్తాం. హెచ్‌సీఏ ప్రతిష్టను మరింతగా పెంచుతాం" అని తెలిపారు. ఇక హెచ్‌సీఏ నూతన కార్యవర్గం ఎన్నికైన నేపథ్యంలో గతంలో చూడని అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తామని, స్టేడియం మౌలిక వసతులను మరింత మెరుగుపరుస్తామని ఆయన స్పష్టం చేశారు. మొత్తానికి, ఉప్పల్‌కు అంతర్జాతీయ మ్యాచ్‌ల రాకతో జీవన్‌రెడ్డి తీసుకున్న ముందడుగు హెచ్‌సీఏకు కొత్త ఊపిరి పోసిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించండి
మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణికారెడ్డి వినతి పత్రం

గోల్కొండ టైమ్స్, నారాయణపేట :

రాష్ట్ర అసెంబ్లీలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శుక్రవారం నారాయణపేట ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణికా రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నారాయణపేట నియోజకవర్గంలో ఉన్న ఆర్టీసీ సమస్యలపై మంత్రితో చర్చించారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ప్రయాణంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించి, ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కొన్ని మార్గాల్లో బస్సుల సంఖ్యను పెంచడం, విద్యార్థులు, ఉద్యోగులు సులభంగా ప్రయాణించేందుకు కొత్త రూట్లను ప్రారంభించడం వంటి అంశాలపై మంత్రికి వినతి పత్రం అందజేశారు. ఈ విషయాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. దీంతో నియోజకవర్గ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.

పోరాట స్ఫూర్తి.. రామన్న!
- అణగారిన వర్గాల గొంతుక రాములు
- మంత్రి సీతక్క

గోల్కొండ టైమ్స్, మోకాలపల్లి :

అట్టడుగు వర్గాల హక్కుల కోసం, అటవీ భూముల రక్షణ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన అమరవీరుడు కామ్రేడ్ రామన్న (రాము) ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. శుక్రవారం మోకాలపల్లి గ్రామంలో నిర్వహించిన కామ్రేడ్ రామన్న 22వ వర్ధంతి సభకు ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి సీతక్క భావోద్వేగంతో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రామన్న కేవలం 14 ఏళ్ల ప్రాయంలోనే తుపాకీ పట్టి అడవి బిడ్డల హక్కుల కోసం పోరాడారని కొనియాడారు. ఉద్యమంలో ఉంటూనే అక్షరాస్యతను, జ్ఞానాన్ని సంపాదించి, దానిని ప్రజల అభివృద్ధి కోసం ఉపయోగించారని గుర్తు చేశారు. కుమ్రం భీం ఆశయాలైన 'జల్, జంగల్, జమీన్' స్ఫూర్తితో రాము చేసిన పోరాటం వల్లే నేడు ఈ ప్రాంత ప్రజల చేతుల్లో అటవీ భూములు ఉన్నాయని ఆమె స్పష్టం చేశారు. తామిద్దరం కలిసి ఈ ప్రాంత హక్కుల కోసం సుదీర్ఘకాలం పోరాడామని గుర్తు చేసుకున్నారు. 'ఒకప్పుడు గన్‌లు పట్టుకుని ఏ సమస్యల పరిష్కారం కోసం పోరాడామో, నేడు అదే సమస్యలను మంత్రిగా పరిష్కరించే బాధ్యతను ప్రజలు నాకు అప్పగించారు. బుల్లెట్ నుంచి బ్యాలెట్ వరకు మా ప్రయాణం మారినా, లక్ష్యం మాత్రం ప్రజా సేవే' అని సీతక్క అన్నారు. రామన్న మరణించి 22 ఏళ్లయినా ఆయన జ్ఞాపకాలు ఇంకా ప్రజల గుండెల్లో సజీవంగానే ఉన్నాయని, ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ప్రజాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పోరాట సహచరులు, మోకాలపల్లి గ్రామస్థులు మరియు భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొని అమరవీరుడు రామన్నకు జోహార్లు అర్పించారు.

ఘనంగా అవుల రాజిరెడ్డి జన్మదిన వేడుకలు
ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ

గోల్కొండ టైమ్స్, నర్సాపూర్ :

నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ అవుల రాజిరెడ్డి జన్మదిన వేడుకలు నర్సాపూర్ మున్సిపల్ పట్టణంలోని తారా లక్ష్మీ డంగోరియా హోమ్ ఫర్ ఏజ్డ్ నీడ్ వృద్ధాశ్రమం లో శివంపేట మండల కేంద్రం చెందిన మాజీ సర్పంచ్ నవీన్ గుప్తా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు, అదేవిధంగా వృద్ధులకు పండ్ల పంపిణీ చేశారు, అనంతరం కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివంపేట మాజీ సర్పంచ్ నవీన్ గుప్తా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని కోరారు. రాజిరెడ్డి సహకారంతో నర్సాపూర్ నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ఇదేవిధంగా రాజన్న సహకారంతో నియోజకవర్గం సమగ్రాభివృద్ధి చెందుతుందని ఆయన ఆశా భావం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రజాపాలనలో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. కార్యకమంలో హత్నూర సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షులు మణిదీప్, మెదక్ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ తరుణ్, యూత్ కాంగ్రెస్ కార్యదర్శి, తలారి ప్రసాద్, హరీష్ కుమార్, నర్సాపూర్ అసెంబ్లీ మాజీ అధ్యక్షుడు ఆంజనేయులు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బండి పాట మంచి స్పందన
గాయకుడిగా మారిన కేంద్రమంత్రి బండి సంజయ్
వైరల్‌గా మారిన ఆరెస్సెస్ గీతాలాపన ప్రోమో

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్)ను స్థాపించి వందేళ్లు పూర్తయిన నేపథ్యంలో కేంద్రమంత్రి బండి సంజయ్ గాయకుడి అవతారమెత్తారు. సంఘ్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో ఆ సంస్థ గీతాలను ఆలపించారు. ఇందుకు సంబంధించిన ప్రోమో తాజాగా విడుదలైంది. ఇప్పుడీ ప్రోమో వైరల్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. శ్రీ రామ నవమి సందర్భంగా శుక్రవారం ఈ పాటలను కరీంనగర్‌లో విడుదల చేశారు. బండి సంజయ్ పాడిన పాటలకు వందేమాతరం శ్రీనివాస్ సంగీతం అందించినట్లు తెలిసింది. బండి పాటకు నెటిజన్ల నుంచి మంచి స్పందన వస్తోంది. ఆయన స్వరం బాగుందని ప్రశంసిస్తున్నారు.

- గోల్కొండ టైమ్స్, హైదరాబాద్

ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

గోల్కొండ టైమ్స్, నారాయణపేట :

జిల్లా వ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో శ్రీరామాలయాలకు తరలివచ్చి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. దేవాలయాలు భక్తులతో కిటకిటలాడుతూ ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. సాయంత్రం సమయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో శ్రీరామనవమి శోభాయాత్రలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ శోభాయాత్రల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని శ్రీరామ నామస్మరణతో నగర వీధులు మార్మోగాయి. భజనలు, కీర్తనలు, హరినామ సంకీర్తనలతో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఎస్పీ దంపతులు ప్రత్యేక పూజలు..

నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అప్పిరెడ్డిపల్లి గ్రామంలోని రామ్ దేవుని గుట్టపై నిర్వహించిన సీతారాముల కళ్యాణ మహోత్సవంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ దంపతులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, సీతారాముల కళ్యాణాన్ని భక్తిశ్రద్ధలతో వీక్షించారు. ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమం ప్రశాంతంగా సాగేందుకు పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు.